

సోమశిలలో 54.479 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 54.479 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1,280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.90,730
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,230
3శాతం జీఎస్టీతో	రూ.8,477
నవర (8గ్రా)	రూ.67,816

గరిష్టం/కనిష్టం
35.0 /26.5

వాతావరణం

ఆదివారం జిల్లాలో వాతావరణం తేమగా ఉండవచ్చని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 70 శాతంగా నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆదివారం	సోమవారం
సా: 6.22	ఉ: 4.51

న్యూస్‌రీల్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట మోసం

- ఇద్దరిపై కేసు నమోదు


నెల్లూరు (క్రైమ్): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట ఓ యువకుడిని మోసగించిన ఘటనలో ఇద్దరిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెంకు చెందిన శివకుమార్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నగరానికి చెందిన మనోజ్‌కుమార్ రూ.2.60 లక్షలు తీసుకుని ఓ కంపెనీలో అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారు. శివకుమార్ ఆ కంపెనీలో 2023 అక్టోబర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా (వర్క్ ఫ్రమ్ హోమ్) చేరారు. నెలలు గడుస్తున్నా.. కంపెనీ జీతం ఇవ్వకపోవడంతో 2024 మేలో కంపెనీ సీఈఓ సాయికుమార్‌తోపాటు మనోజ్‌కుమార్‌ను కలిశారు. జీతం ఇవ్వాలని కోరగా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తూ రావడంతో విసిగిపోయిన శివకుమార్ ఉద్యోగం మానివేస్తున్నానని, తన వద్ద తీసుకున్న రూ.2.60 లక్షలు తిరిగి చెల్లించాలని వారిపై ఒత్తిడి తీసుకువచ్చాడు. వారు వడ్డీతో సహా చెల్లిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా.. ఫలితం లేకపోవడంతో ఈ మేరకు బాధితుడు శనివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు.

కెమిస్ట్రీ, హిస్టరీ జవాబు పత్రాల మూల్యాంకనం



మాట్లాడుతున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ హిస్టరీ, కెమిస్ట్రీ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని శనివారం స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కేవీఆర్ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. దీనికి ముందు ఆర్ఐఓ శ్రీనివాసులు మూల్యాంకనం సెంటరులో సంబంధిత సబ్జెక్ట్ అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి బాటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం 1000 మంది అధ్యాపకులు ఆయా సబ్జెక్టుల మూల్యాంకనంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల మొదటి వారానికి మూల్యాంకనం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



శిక్షణ నిధులు భక్షణ!

జిల్లాలో ఐసీడీఎస్, విద్యాశాఖలు అవినీతి మయంగా మారాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే అంగన్‌వాడీల విధులను పర్యవేక్షించే అధికారుల నుంచి ప్రాజెక్ట్ కార్యాలయం వరకు అడుగడుగునా ప్రతి బిల్లులో కమీషన్లు కొట్టేస్తున్నారు. ప్రాజెక్ట్ స్థాయి సమావేశాలకు వెళ్లినా.. సెక్టార్ స్థాయి సమావేశాలకు వెళ్లినా కనీసం టీఏ బిల్లులు ఇవ్వకుండానే ఇచ్చేసినట్లు కాజేస్తున్న పరిస్థితి. ఇటీవల అంగన్‌వాడీలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో 'జ్ఞానజ్యోతి', ఐడీసీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ భీ, పఢాయి భీ ట్రెనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి ఏర్పాటు చేసిన భోజనం, స్నాక్స్ నిధుల్లో ఎంతఓలు కుక్కుర్తి చూపించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ శిక్షణకు హాజరైన కొన్ని ప్రాజెక్టుల అంగన్‌వాడీలకు ఇంత వరకు టీఏ బిల్లులు చెల్లించలేదని తెలుస్తోంది.

- గత నెలలో అంగన్‌వాడీలకు 'జ్ఞానజ్యోతి' ట్రెనింగ్
- ఈ నెలలో పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమం
- భోజనం, స్నాక్స్‌లో కక్కుర్తి
- టీఏ బిల్లులూ అందరికీ చెల్లించని వైనం



ఉదయగిరి: ఐసీడీఎస్, విద్యా శాఖల్లోని కొందరు అధికారులు అవినీతిలో మునిగి తేలుతున్నారు. గత నెలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో 'జ్ఞాన జ్యోతి, ఈ నెలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ భీ, పఢాయి భీ శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు మంజూరు చేసిన భోజనం, స్నాక్స్, టీఏ, స్టేషనరీ నిధులను భారీగా మెక్కినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన విద్యాబోధన కోసం జిల్లా వ్యాప్తంగా సెక్టార్ స్థాయిలో కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఇందులో అంగన్‌వాడీలకు అందించిన భోజనం, స్టేషనరీ సామగ్రి కొనుగోలు, రవాణా ఖర్చులు (టీఏ), స్నాక్స్ తదితరాల్లో కొంత మంది నిర్వాహకులు చేతివాటం ప్రదర్శించి నిధులు స్వాహా చేశారు. రోజంతా కష్టపడితే అంతంత మాత్రం వేతనాలు వచ్చే చిరుద్యోగుల కడుపు కొట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చుతోంది. 3 నుంచి 6 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న చిన్నారులకు ఆట, పాటతో కూడిన చదువులు అందించేలా 'జ్ఞానజ్యోతి' పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ఎంఈఓల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు విడతలుగా గత నెల 18వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రతి కార్యకర్తకు రోజుకు భోజనం, స్నాక్స్ కోసం రూ.300 కేటాయించింది. టీఏ కింద రూ.50, స్టేషనరీ మెటీరియల్ కోసం మరో రూ.100 కేటాయించారు. అయితే భోజనం, స్నాక్స్ కోసం కేవలం రూ.80 నుంచి రూ.100 వరకే ఖర్చు చేసినట్లు సమాచారం. కొన్ని కేంద్రాల్లో కనీసం మంచినీరు, స్నాక్స్ కూడా ఇవ్వలేదు. మధ్యాహ్న భోజనం అత్యంత నాసిరకంగా అందించారు. అప్పటికప్పుడే చెల్లించాల్సిన టీఏలు ఇంత వరకు ఇవ్వలేదని కొందరు అంగన్‌వాడీలు ఆరోపిస్తున్నారు. ఇక స్టేషనరీ సామగ్రి కొనుగోలు విషయంలోనూ అదే తంతు.

ఈ నెలలో మూడు రోజుల పాటు ఐడీసీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం కోసం ప్రతి కార్యకర్తలకు రూ.450 ప్రభుత్వం కేటాయించింది. ఇందులో భోజనం, స్నాక్స్ కోసం రూ.250, సామగ్రి కొనుగోలుకు రూ.50, టీఏ కోసం రూ.150 ఖర్చు చేయాలి. ఈ కార్యక్రమంలో కూడా అధికారులు చేతివాటం ప్రదర్శించారు. భోజనం, స్నాక్స్ కోసం రూ.80 నుంచి రూ.100 వరకు ఖర్చు చేశారు. టీఏ రూ.150 ఇవ్వలేదు.

పెద్ద మొత్తంలో స్వాహా

జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు రెండు శాఖల ఆధ్వర్యంలో 2,900 మంది శిక్షణ తీసుకున్నారు. విద్యాశాఖ పర్యవేక్షణలో జరిగిన శిక్షణలో ప్రతి కార్యకర్త నుంచి ఒక్క భోజనం కోసమే కేటాయించిన నిధుల్లో రోజుకు రూ.200 లెక్కన స్వాహా చేశారు. ప్రతి రోజు రూ.5.80 లక్షలు, ఆరు రోజులకు రూ.34.80 లక్షలు మింగేశారు. టీఏ కోసం రూ.8.70 లక్షలు కేటాయించగా, ఇంత వరకు చాలా మందికి అందలేదు. కొంతమంది ఎంఈఓలు టీఏలు ఇవ్వగా, మరి కొంతమంది ఆలస్యమైతే మర్చిపోతారులే అని జాప్యం చేస్తూ ఇంకా బడ్జెట్ రాలేందటూ దాటవేస్తున్నారు.



వింజమూరులో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సీడీపీఓ పద్మజా కుమారి (ఫైల్)

ఐసీడీఎస్‌లోనూ అదే తీరు

ఈ శాఖ ఆధ్వర్యంలో కూడా అదే దందా కొనసాగింది. భోజనం, స్నాక్స్ కోసం రూ.100 ఖర్చు చేసి రూ.150 స్వాహా చేశారు. వింజమూరు ప్రాజెక్ట్‌లో అయితే కనీసం మంచినీరు, స్నాక్స్ కూడా ఇవ్వలేదు. ఇందులో కూడా భోజనంలో రూ.13 లక్షలు స్వాహా చేశారు. టీఏ రూపంలో ప్రతి కార్యకర్తకు రోజుకు రూ.150 లెక్కన రూ.450 ఇవ్వాల్సి ఉంది. ఇంత వరకు పైసా కూడా ఇవ్వలేదు. ఎవరైనా అడిగితే వేధింపులు తప్పవని ఎవరూ సాహసం చేసి సీడీపీఓలను టీఏ అడగలేకపోతున్నామని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి ఇందులో ప్రమేయం ఉన్న వారిపై చర్యలు తీసుకొని కార్యకర్తలకు రావాల్సిన టీఏలు ఇప్పించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా నిబంధనల మేరకే వ్యవహరించామని తెలిపారు. టీఏ విషయంలోనూ, భోజనం ఖర్చు విషయం గురించి సమగ్ర సమాచారం ఇవ్వకుండా దాటవేశారు.



ఘటనా స్థలంలో నందకిశోర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ప్రాణాలు తీసిన అతివేగం

- ఆటోను బైక్ ఢీకొని ముగ్గురి దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు ఐటీఐ విద్యార్థులు, ఆటో డ్రైవర్

ముగ్గురు యువకుల అతివేగం ముగ్గురి ప్రాణాలు బలిగొంది. ఒకే బైక్‌పై మితిమీరిన వేగంతో వెళ్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఇద్దరు యువకులతోపాటు ఆటో డ్రైవర్ కూడా దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. పనిమీద నెల్లూరుకు వెళ్లి.. తిరుగు ప్రయాణంలో యువకుల్లో ఒకరి అమ్మమ్మ ఇంటికి వెళ్తూ ఈ దుర్ఘటనలో మృత్యువాత పడ్డారు.



ఘటనా స్థలంలో వరుణ్‌కుమార్ మృతదేహం

మనుబోలు: నిర్లక్ష్యంగా అతి వేగంతో బైక్ నడుపుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ ఘటన మనుబోలు మండలంలోని గొట్లపాళెం వద్ద శనివారం జరిగింది. మూడు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చిన ఈ ఘటన ఆటో డ్రైవర్ కుటుంబాన్ని రోడ్డున పడేసింది. సైదాపురం మండలం ఊటుకూరు దళితవాడకు చెందిన నోసిన వెంకటేశ్వర్లు కుమారుడు వరుణ్‌కుమార్ (18), అర్తనపల్లి శంకరయ్య కుమారుడు నందకిశోర్ (18), మరో కుమారుడు అర్తనపల్లి ఈశ్వర్ ముగ్గురు మిత్రులు. వీరిలో వరుణ్‌కుమార్, నందకిశోర్ గూడూరులోని కళ్యాణ్ చక్రవర్తి కళాశాలలో ఐటీఐ చదువుతున్నారు. ఈ ముగ్గురు కలిసి బైక్‌పై నెల్లూరుకు పనిమీద వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గొట్లపాళెంలో ఉంటున్న వరుణ్ అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు నెల్లూరు నుంచి కసుమూరు, వడ్లపూడి మీదుగా వేగంగా వస్తున్నారు. అదే సమయంలో పొదలకూరు నుంచి ప్రయాణికులతో వడ్లపూడి వెళుతున్న ఆటోను ఎదురుగా వచ్చిన బైక్ అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వరుణ్‌కుమార్, నందకిషోర్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్ తురకా సురేంద్ర (38) తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై వెనుక ఉన్న ఈశ్వర్‌తోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను పొదలకూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేంద్ర మృతి చెందాడు. మృతులు ముగ్గురివి పేద కుటుంబాలే. అతి వేగం, నిర్లక్ష్యం మూడు కుటుంబాలను రోడ్డుపాల్జేసింది. సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, మనుబోలు ఎస్సై శివరాకేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కుటుంబాల్లో విషాదం

ఈ ఘటన మూడు కుటుంబాల్లో విషాదం మిగిల్చింది. ఊటుకూరుకు చెందిన ఇద్దరు యువకులు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. చేతికంది వచ్చిన కుమారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డున పడిన ఆటో డ్రైవర్ కుటుంబం

ఆటో డ్రైవర్ సురేంద్రది పొదలకూరు కాగా అతను వడ్లపూడిలో పెళ్లి చేసుకుని ఇల్లరికం వచ్చి ఇక్కడే ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సురేంద్రకు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. సురేంద్ర మృతి చెందడంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయి రోడ్డున పడినట్లు అయింది.



పొదలకూరు ఆస్పత్రిలో సురేంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ధాన్యం కొను'గోల్' తంతు

- జిల్లాలో 10 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- ఇప్పటికే 60 శాతం కోతలు పూర్తి
- పీపీసీల ద్వారా 33,275 మెట్రిక్ టన్నులే కొనుగోలు
- 103 రైస్ మిల్లులకు సీఎంఆర్ అనుమతి
- 50 మిల్లులే రూ.30 కోట్ల బ్యాంక్ గ్యారెంటీ
- కల్లాల్లో ధాన్యం కొనడం ఒక ప్రహసనం

జిల్లాలో పీపీసీల ద్వారా ధాన్యం కొనుగోలు ఒక తంతుగా సాగుతోంది. దిగుబడికి.. కొనుగోలుకు మధ్య తేడానే ఇందుకు అద్దం పడుతోంది. సీఎంఆర్ అనుమతి ఉన్న రైస్ మిల్లుల్లో సగం మిల్లులు కూడా బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వలేదంటే ప్రభుత్వం, రైస్ మిల్లర్లు కలిసి 'దోపిడీ డ్రామా' ఆడుతున్నట్లు విస్పష్టమవుతోంది. కల్లాల్లోనే ధాన్యం కొనడం ఒక ప్రహసనంగా సాగుతోంది. ఏ రోజుకు ఆ రోజు పీపీసీల ద్వారా కొంటున్న ధాన్యం లెక్కలు అధికార యంత్రాంగం ప్రకటిస్తున్నా.. ఏ రైతు నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయాలు చేసుకోవడం లేదు. నేరుగా దళారులకే అమ్ముకుంటున్నారనేది నిజం.

రైతు నష్టపోతున్నదిలా..

కొడవలూరు మండలానికి చెందిన ఓ రైతుకు 8 ఎకరాల పొలం ఉంది. ఆయన బీపీటీ 5204 వరి సాగు చేశాడు. పంట కోతకు రావడంతో ఒక దళారీని సంప్రదించాడు. పుట్టికి రూ.17 వేలు మాత్రమే ధర ఉందని చెప్పాడు. దీంతో ఆ రైతు స్థానిక పీపీసీ ద్వారా ధాన్యం విక్రయించడానికి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాడు. దిగుబడి అంచనాను బట్టి గన్నీ బ్యాగ్స్ ఆ రైతుకు అందజేశారు. వరి కోత కోసి ధాన్యం రాసి పోశాడు. సదరు రైతు ధాన్యం సరఫరా చేయడానికి ట్యాగ్ చేసిన మిల్లర్ అంత ధాన్యం తాము తీసుకోమని, మార్కెట్లో పుట్టి రూ.17 వేలే ఉంటే.. పీపీసీ ద్వారా రూ.19,700 పెట్టి ఎందుకు కొనాలని రైతును ప్రశ్నించాడు. ఇక కూలీలు, రవాణా ఖర్చులు పెట్టుకుని, మిల్లర్ అడిగినంత తరుగు ఇచ్చుకుంటే.. పుట్టికి రూ.16 వేలు కూడా వచ్చేటట్లు లేదని లెక్కలు వేసుకున్న ఆ రైతు ఆలోచనలో పడ్డాడు. అప్పటికే రెండు రోజులు గడిచిపోవడంతో ధాన్యం తడారిపోతుండడంతో నేరుగా మిల్లర్‌కే దళారీ ద్వారా విక్రయించాడు. కానీ ఈ ధాన్యం పీపీసీ ద్వారా విక్రయించినట్లు ఇటు అధికారులు, అటు మిల్లర్ నమోదు చేసుకున్నారు.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో రైతులకు ప్రభుత్వం అండగా ఉందని చెప్పడానికి సివిల్ సప్లయీస్, కో–ఆపరేటివ్ మార్కెటింగ్ శాఖల ద్వారా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికార యంత్రాంగం ఆర్భాటంగా ప్రకటించింది. అధికార యంత్రాంగం, మిల్లర్లు మిలాఖత్ అయి నిత్యం పీపీసీల ద్వారా ధాన్యం కొనుగోలు లక్ష్యం ఒక తంతుగా మార్చేశారు. దళారుల ద్వారా మిల్లర్ కొనుగోలు చేసిన ధాన్యాన్ని సైతం పీపీసీల లెక్కల్లో వేసి రైతులను దగా చేస్తున్నారు. పీపీసీల ద్వారా ధాన్యం విక్రయించినట్లు నమోదైన రైతులకు మద్దతు ధర ప్రకారం పుట్టికి రూ.19,600 అందించామని అధికారులు నిజాయితీగా గుండెలపై చేయి వేసుకుని చెప్పగలరా?. నిరూపించగలరా?. అంటే ఏదీ చెప్పలేరు.

దిగుబడి ఎంత.. కొన్నది ఎంత..

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముమ్మరం చేశామని నిత్యం ఆర్భాటంగా అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌కు సంబంధించి సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని వీరే చెబుతున్నారు. కానీ శనివారం నాటికి 33,275 మెట్రిక్ టన్నుల ధాన్యం పీపీసీల ద్వారా కొనుగోలు చేసినట్లు అధికారులు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 60 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. అంటే దాదాపు 6 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు వచ్చాయి. ఇందులో పీపీసీల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం 5 శాతం కూడా లేదని అధికారుల ప్రకటన ద్వారానే అర్థమవుతోంది. దిగుబడి వచ్చిన 95 శాతం ధాన్యం నేరుగా మిల్లర్లకు దళారుల ద్వారా విక్రయిస్తున్నారనేది వాస్తవం. అధికార యంత్రాంగం 300 పీపీసీలు ఏర్పాటు చేసినట్లు ఆర్భాటంగా చెబుతున్నా.. జిల్లాలో ఒక్క రైతుకు కూడా న్యాయం జరగడం లేదనేది ఈ లెక్కలే చెబుతున్నాయి.

పీపీసీల ద్వారా దళారులే విక్రయాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 33,275 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు చెబుతున్నా, ఇందులో 90 శాతం దళారుల ద్వారానే జరిగాయని తెలుస్తోంది. వాస్తవానికి రైతులు పీపీసీలను సంప్రదించినా మిల్లరు ధాన్యం కొనడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తేనే గన్నీ బ్యాగ్‌లు ఇస్తారు. ఈ ప్రక్రియ అస్సలు జరగడం లేదు. పీపీసీల ద్వారా ధాన్యం కొనుగోలుకు మిల్లరు సిద్ధపడితే ధాన్యం పట్టుబడి నుంచి మిల్లు వరకు చేర్చే బాధ్యత ఆ రైతుదే. ధాన్యం పట్టుబడి చేయడానికి బస్తాకు రూ.30 కూలి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది రైతులే భరించుకోవాలి. 99 శాతం మంది మిల్లర్లు పీపీసీల ద్వారా ధాన్యం విక్రయించుకునే రైతులకు గన్నీ బ్యాగ్‌లు ఇవ్వడం లేదు. రైతులే బస్తాలు, ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాలి. తీరా మిల్లరు దగ్గరకు ధాన్యం తీసుకెళ్లితే నాణ్యత లేదని, గడ్డి ముక్క ఉందని, తేమ శాతం అధికంగా ఉందని తరుగు పేరుతో పేచీ పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న పరిస్థితి. ఇన్ని ఖర్చులు, ఇన్ని ఇబ్బందులు భరించినా.. చివరకు ఆ రైతుకు పుట్టి ధాన్యానికి దక్కే ధర రూ.15 వేలు కూడా రావడం లేదు. దీంతో రైతులు ఈ తలనొప్పులు ఎందుకుని దళారులనే ఆశ్రయించి అమ్ముకుంటున్నారు. వీరు సదరు రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసి వారి పొలం తాలూకా పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ తీసుకెళ్లి పీపీసీలో నమోదు చేయించుకుంటున్న విషయం బహిరంగ విషయం.

బ్యాంక్ గ్యారెంటీలు అరకొరే

జిల్లాలో సీఎంఆర్ (కస్టమ్ రైస్ మిల్లింగ్) చేసే మిల్లులు 103 ఉన్నప్పటికీ వీటిలో కేవలం 50 నుంచి 60 మిల్లులు మొక్కుబడిగా బ్యాంక్ గ్యారెంటీలు ఇచ్చాయి. మిగతా మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీలు ఇవ్వకపోయినా.. అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో వారికే తెలియాలి. పీపీసీ ద్వారా ధాన్యాన్ని మిల్లుకు ట్యాగ్ చేయాలంటే.. సదరు మిల్లరు బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చి ఉండాలి. బ్యాంక్ గ్యారెంటీ లేని మిల్లుకు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యాన్ని పీపీసీ ద్వారా పంపించడం అసాధ్యం. మిల్లర్లు ప్రభుత్వానికి బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వకపోవడంతో పీపీసీలు ఆ మిల్లులకు ధాన్యాన్ని ట్యాగ్ చేయడం లేదు. దీంతో రోజుల తరబడి రైతులు ధాన్యాన్ని నిలబెట్టుకోలేక నేరుగా మిల్లర్లకు దళారుల ద్వారా విక్రయించుకుంటున్నారు.

డీలర్ల పరస్పర దూషణలు

నెల్లూరు (పొగతోట): రేషన్ డీలర్లు డీఎస్ఓ కార్యాలయం సాక్షిగా పరస్పరం దూషణలు, ప్రతి విమర్శలకు దిగారు. రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ ప్రక్రియపై డీఎస్ఓ అంకయ్య ఆధ్వర్యంలో చౌకదుకాణం డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. అనంతరం కార్యాలయం బయట డీలర్లు ఒకరిపై ఒకరు అసభ్య పదజాలాలతో తిట్ల పురాణం అందుకున్నారు. నీ అంతు చూస్తా.. అక్రమాలకు పాల్పడేది నువ్వే.. దొంగ ఐడీలు, బోగస్ పేర్లతో చౌకదుకాణాలు నిర్వహిస్తున్నావంటూ ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటూ పరువు తీసుకున్నారు. తోటి డీలర్లు సర్దుబాటు చేయడంతో ఎవరి దారిన వారు వెళ్లి పోయారు.

జాతీయ స్థాయి ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

కావలి: పట్టణంలోని టెన్నిస్ అసోసియేషన్, అఫిషియల్ క్లబ్ కమిటీల ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగే డాక్టర్ సీఎల్ఎస్ రెడ్డి సుజనమ్మ ట్రస్ట్ జాతీయ స్థాయి ఇన్విటేషన్ డబుల్స్ టెన్నిస్ టోర్నీ పోటీలను శనివారం కావలి డీఎస్పీ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. స్థానిక అఫిషియల్ క్లబ్ ప్రాంగణంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. టోర్నీ ఆర్గనైజర్లు అనుమలశెట్టి రామకృష్ణ, పీవీ వంశీమోహన్ మాట్లాడుతూ పట్టణంలోని అఫిషియల్ క్లబ్‌లోని టెన్నిస్ కోర్టు, జవహర్‌భారతి కళాశాలలోని టెన్నిస్ కోర్టు, తుమ్మలపెంట రోడ్డు వద్దనున్న ఎస్ఆర్ క్లబ్ టెన్నిస్ కోర్టుల్లో ఈ పోటీలో 30 ప్లస్, 40 ప్లస్, 50 ప్లస్, 60 ప్లస్,70 ప్లస్ తదితర ఐదు విభాగాల వయస్సు కలిగిన వారు పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 70 టీంలు, 140 ఆటగాళ్లు పాల్గొంటారని తెలిపారు. కావలి రోటరీక్లబ్ వ్యవస్థాపకులు, సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు, విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి సహాయ సహకారాలతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ



కావలి: పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా బక్కాలి నుంచి తమిళనాడులోని కన్యాకుమారి వరకు సీఐఎస్ఎఫ్ సిబ్బంది చేపట్టిన సైకిల్ యాత్ర కావలికి శనివారం చేరుకుంది. దేశంలోకి అక్రమ చొరబాట్లు, స్మగ్లింగ్ కట్టడి, తీర ప్రాంత రక్షణ తదితరాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో యాత్రను ఈ నెల ఏడున ప్రారంభించారు. మొత్తం 60 మంది సభ్యులు పాలుపంచుకున్న ఈ యాత్ర కన్యాకుమారిలోని వివేకానంద మెమోరియల్ వద్ద ముగియనుంది.

ఈ - కేవైసీని నూరు శాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అంకయ్య

నెల్లూరు (పొగతోట): రేషన్‌కార్డుదారులకు సంబంధించిన సభ్యులందరితో ఈ - కేవైసీని పూర్తి చేయించాలని డీఎస్‌ఓ అంకయ్య ఆదేశించారు. నగరంలోని జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో డీలర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 7.21 లక్షలకుపైగా రేషన్ కార్డులకు గానూ 20 లక్షలకుపైగా సభ్యులున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 18 లక్షల మంది ఈ - కేవైసీని పూర్తి చేశారని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలకు మినహాయింపు ఉందని, ఈ నెల 31లోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

బైక్‌ల ఢీ: నలుగురికి గాయాలు



ఉదయగిరి: బైక్‌లు ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని గడ్డంవారిపల్లె సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఉదయగిరికి చెందిన చాంద్‌బాషా, మస్తాన్, కాలేషా బైక్‌పై కృష్ణంపల్లెలోని పొలం వద్దకు బయల్దేరారు. వీరి వెనుకనే బైక్‌పై వస్తున్న పట్టణానికి చెందిన మస్తాన్.. గడ్డంవారిపల్లె సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి ఢీకొన్నారు. ఘటనలో నలుగురూ గాయపడ్డారు. వీరిని 108లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దుత్తలూరులో పట్టపగలే దొంగతనం

- 11 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ



చెల్లాచెదురుగా బీరువాలోని దుస్తులు

దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లో శనివారం పట్టపగలే దొంగతనం జరిగింది. వివరాలు.. సెంటర్ సమీపంలోని వెంకయ్య స్వామి మందిర పక్కన చింతనబోయిన నరేష్ నివసిస్తున్నారు. మధ్యాహ్న వేళ ఎవరూ లేని సమయంలో గేట్ తాళాన్ని పగలగొట్టి.. ప్రధాన ద్వార తలుపు, తాళాన్ని ధ్వంసం చేసి లోపలికి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి అందులోని 11 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఇంటికొచ్చిన అనంతరం చోరీ విషయాన్ని నిర్ధారించుకున్న బాధితుడు.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని ఎస్సై ఆదిలక్ష్మి పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉల్లాస్.. ఖల్లాస్

గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే గొప్ప సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యం నీరుగారుతోంది. మూడేళ్ల పాటు విడతల వారీగా నిర్వహించాలని నిర్ణయించిన దీనికి రాష్ట్ర ప్రభుత్వం జత కలిసింది. అతివల అక్షరాస్యతను పెంచి సమాజాభివృద్ధిలో వారు కీలకంగా వ్యవహరించేలా తీర్చిదిద్దాలని భావించారు. అయితే అనుకున్నదొక్కటి.. అయినదొక్కటి అనే తీరులా పరిస్థితి మారింది.

- నీరుగారుతున్న లక్ష్యం
- అక్షరాలు నేర్పేది పేరుకే
- ఎలా రాయాలి, ఏమి రాయాలో తెలియని వయోజనులు
- గ్రామాల్లో కానరాని అభ్యసన తరగతులు
- జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నేడు

అభ్యసన తరగతులు (ఫైల్)



దుత్తలూరు: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఉల్లాస్ కార్యక్రమం జిల్లాలో తుస్సుమంది. జిల్లాలోని అధిక శాతం గ్రామాల్లో అభ్యసన తరగతులను నిర్వహించలేదు. జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న అర్హత పరీక్షల్లో ఎలా రాయాలి.. ఏమి రాయాలో తెలియని పరిస్థితి వయోజనుల్లో నెలకొంది.

20 వేల మంది గుర్తింపు

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు మహిళలకు నిరక్షరాస్యత అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పొదుపు సంఘాలు, పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళలు, వంట పని వారు, అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు తదితరాల్లో నిరక్షరాస్యులకు రాత్రి పూట రెండు గంటల పాటు చదవడం, రాయడాన్ని నేర్పేందుకు అభ్యసన తరగతులను నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి సుమారు 20 వేల మందిని గుర్తించి మొదటి విడత అభ్యసన తరగతులను గతేడాది డిసెంబర్ నుంచి ప్రారంభించారు.

అంతా అయోమయం

గుర్తించిన మహిళల్లో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన పొదుపు సంఘాల్లోని వారే. బోధించేందుకు గానూ ప్రతి పది మందికొకరు చొప్పున సంఘంలో విద్యావంతులైన ఒక స్వచ్ఛంద శిక్షకురాలిని నియమించాలి. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవనం, పాఠశాల తదితరాల్లో ఎక్కడో ఒక చోట అభ్యసన తరగతులను జరపాలి. అభ్యసన సామగ్రినీ ప్రభుత్వమే అందజేసింది. అయితే ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అభ్యసన తరగతులు జరిగాయా.. నమోదైన మహిళలను వలంటీర్లు అక్షరాస్యులుగా తీర్చిదిద్దారానే అంశంలో స్పష్టత కరువైంది.



వయోజనులకు అందజేసిన పుస్తకాలు

పర్యవేక్షణ లోపం

ప్రాథమిక అక్షరాస్యత పరీక్షను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ద్వారా ఆదివారం నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేశారు. అయితే గ్రామాల్లో అభ్యసన తరగతులు సక్రమంగా జరగలేదని, అక్కడక్కడా తూతూమంత్రంగా సాగాయనే విమర్శలూ లేకపోలేదు. సంబంధిత అధికారులు సైతం నామమాత్రంగా పర్యవేక్షించి ఫొటోలకే పరిమితమయ్యారని సమాచారం. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడినట్లయింది.

1918 కేంద్రాల్లో పరీక్ష

జిల్లాలోని 1918 కేంద్రాల్లో 19,178 మంది వయోజనులకు పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. దీనికి గానూ జిల్లాకు రూ.3,45,204 నిధులను కేటాయించామని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. మూడు విభాగాల్లో మొత్తం 150 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో 50 మార్కులొస్తేనే సక్సెస్‌ఫుల్ లెర్నర్‌గా పరిగణించనున్నారు. ఒకవేళ ఒక్కో దాంట్లో 12 మార్కులొస్తే, ఐదింటిని గ్రేస్‌గా కలుపుతారు. దీని కంటే తక్కువ వస్తే నీడ్ టు ఇంప్రూవ్ కింద భవిష్యత్తులో మరింత శిక్షణ ఇవ్వాలని భావిస్తారు. ఇందులో పాస్ లేదా ఫెయిల్ అనేదే ఉండదు.

పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు



కావలి డివిజన్లో పరీక్షల నిర్వహణకు అంగన్‌వాడీలకు అవగాహన సదస్సులను నిర్వహించి అవసరమైన మెటీరియల్‌ను అందజేశాం. వయోజనులందరూ పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టాలి. అంగన్‌వాడీలే మూల్యాంకనం చేయనున్నారు.

– బాదుల్లా, సూపర్‌వైజర్, వయోజన విద్య, కావలి డివిజన్

33,275 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు రూరల్: జిల్లాలో ఏర్పాటు చేసిన పీపీసీల ద్వారా ఇప్పటి వరకు 33,275 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జేసీ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. 4363.64 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని శనివారం కొనుగోలు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు రూ.60.36 కోట్లను రైతులకు చెల్లించామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

రౌడీషీటర్ల బైండోవర్

నెల్లూరు(క్రైమ్): అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు రౌడీషీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. వివరాలు.. పలు ప్రాంతాల్లో తనిఖీలను చిన్నబజార్ ఎస్సై అబ్దుల్ రజాక్ శనివారం చేపట్టారు. గాంధీబొమ్మ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మెక్లిన్‌రోడ్డుకు చెందిన సుల్తాన్, మౌలాలీ, కోటమిట్టకు చెందిన సందానీ, ఇరుగాళమ్మ సంఘానికి చెందిన చిన్నాను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి బైండోవర్ చేశారు.

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి : రూ.85
నన్నవి : రూ.50
పండ్లు : రూ.30



గిట్టుబాటు ధర కల్పనలో విఫలం



పార్టీ వెంకటాచలం మండల నేతలు, కార్యకర్తలతో సమావేశమైన కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో వెంకటాచలం మండల పార్టీ నేతలు, కార్యకర్తలతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు గిటుబాటు ధర కల్పించకుండా ప్రకటనలనే పరిమితమవుతున్నారని విమర్శించారు. సోమిరెడ్డి మొక్కుబడిగా జరిపిన గొలగమూడి పర్యటనను చూసి రైతులు ఆవేదనకు గురయ్యారని చెప్పారు. డ్రామాలను ఆపి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు. తమ ప్రభుత్వ హయాంలో గతేడాది పుట్టి ధాన్యం రూ.25 వేలు పలకగా, ప్రస్తుతం రూ.16 వేలకు పతనమైందని తెలిపారు. రైతులకు కనీస గిట్టుబాటు ధరగా రూ.19720 కల్పించాల్సి ఉండగా, దళారులు రూ.16 వేలకే దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా, అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారే తప్ప, రైతులను ఆదుకునేందుకు యత్నించడంలేదన్నారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీగా సమస్యను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, మద్దతు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న పోలీస్ అధికారులను విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు. పోలీసులు అనుచితంగా ప్రవర్తించారనే అంశాన్ని తన దృష్టికి తీసుకొస్తే న్యాయస్థానాలను ఆశ్రయించి ప్రైవేట్ కేసులేస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో అవినీతి విధానాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. ప్రజలకు ఏ సమస్యొచ్చినా అండగా నిలిచి పోరాటాలకు సిద్ధంగా ఉంటామని తెలిపారు.


కీలకమైన రికార్డులు.. అధికారి ఇంటికా..?



మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: డీసీఎమ్మెస్‌లోని కీలకమైన మినిట్స్ బుక్, డే బుక్, లెడ్జర్లు.. డివిజనల్ కోఆపరేటివ్ అధికారి సుధాభారతి ఇంటికి మార్కెటింగ్ మేనేజర్ ద్వారా బుధవారం వెళ్లాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు ఆరోపించారు. నార్తురాజుపాళెంలోని తన అతిథిగృహ ప్రాంగణంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. రికార్డులను అధికారి ఇంటికి తీసుకెళ్తుండగా, మార్కెటింగ్ మేనేజర్ రవికుమార్‌ను ఓ విలేకరి ప్రశ్నించారని, దీంతో ఆయన తడుముకుంటూ తాను కొత్తగా వచ్చానని, అధికారి సూచనల మేరకే తీసుకెళ్లానని చెప్పారన్నారు. సీసీ పుటేజీల్లో చూసినా ఇదే విషయం బహిర్గతమవుతుందని చెప్పారు. డీసీఎమ్మెస్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ ఉన్నారని, ఆయనకు తెలియకుండా రికార్డులను అధికారి ఇంటికి తీసుకెళ్లడం దారుణమని చెప్పారు. అందులో దేన్ని మార్చేందుకు తీసుకెళ్లారో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సదరు అధికారిపై గతంలోనూ అనేక అవినీతి ఆరోపణలున్నాయని చెప్పారు. డీసీఎమ్మెస్ మార్కెటింగ్ మేనేజర్‌గా ఆమె ఉన్న సమయంలో సంస్థ రైస్ మిల్లును తన భర్తకు అప్పగించిన అంశాన్ని ప్రస్తావించారు. మిల్లులో అవకతవకలు జరిగి మెషినరీ పనికిరాకుండా పోయిందని చెప్పారు. డీసీఎమ్మెస్‌కు చెందిన బాణసంచా, పుస్తకాలు, వేప పిండి వ్యాపారంలోనూ రూ.నాలుగు లక్షలను స్వాహా చేశారని ఆరోపించారు. ఐసీడీఎస్ పీడీగా నియమించగా, అందులోనూ భారీ అవకతవకలకు పాల్పడ్డారని చెప్పారు. ఆమె తీరే ఇంతని, మరో రెండు నెలల్లో రిటైరవ్వనున్నారని తెలిపారు. ఆమె అవినీతి బాగోతంపై విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ సుప్రియ, పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, నేతలు కొండా శ్రీనివాసులురెడ్డి, మాణిక్యరావు, అనపల్లి ఉదయ్ భాస్కర్, జడ్డా సాయికుమార్, గాలి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ ఫిల్మ్‌పై తనిఖీలు



నెల్లూరు (టౌన్): రవాణా నిబంధనలకు విరుద్ధంగా కార్లు, బైక్‌లకు ఉన్న నంబర్ ప్లేట్లు, బ్లాక్ ఫిల్మ్‌పై ఇన్‌చార్జి ఆర్టీఓ బాలమురళి ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారులు విస్తృత తనిఖీలను శనివారం నిర్వహించారు. ముత్తుకూరు గేట్ సెంటర్‌లో జరిపిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న 38, బ్లాక్‌ఫిల్మ్ బిగించిన ఐదు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న నాలుగు, సరైన పత్రాల్లేకుండా తిరుగుతున్న మూడు.. మొత్తం 50 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఎమ్వీఐలు రఫీ, పవన్ కార్తీక్, ఏఎమ్వీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.